## చింతపల్లిలో ఉద్యోగ మేళా 8న



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, ఐటీడీఏ పీఓ అభిషేక్, సబ్ కలెక్టర్ తదితరులు

*పాడేరు, న్యూస్‌టుడే:* ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ నెల 8వ తేదీన చింతపల్లి గిరిజన యువత శిక్షణ కేంద్రంలో ఉద్యోగా మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ప్రచార గోడప్రతులను శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ ఉద్యోగ మేళాలో అపోలో ఫార్మసీ, నవత రోడ్ ట్రాన్స్‌పోర్టు, కేర్ ఫర్ యు తదితర కంపెనీలు హాజరుకానున్నాయన్నారు. జిల్లాలో 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు. ఇంటర్, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఆపై చదువు పూర్తిచేసిన నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 89858 32827, 93983 38105 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ గౌడ, ఐటీడీఏ పీఓ వి.అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, నైపుణ్యాభివృద్ధి అధికారిణి పి.రోహిణి, డీఆర్‌ఓ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


## ఉద్యాన పంటలకు ఉపాధి ఊతం




ఈనాడు, పాడేరు

- ★ పండ్లు, పూల తోటల పెంపకానికి నరేగా నేస్తం
- ★ అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 13,853 ఎకరాల్లో సాగు

**జల సంరక్షణ పనులతో పాటు వ్యవసాయానుబంధ రంగాలకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం (నరేగా) తోడుగా నిలుస్తోంది. కూలీలకు స్థానికంగా ఉపాధిని చూపించడమే కాకుండా ఉద్యాన పంటల పెట్టుబడికి ఆర్థిక సాయం అందిస్తోంది. పండ్లతో పాటు పూల తోటల సాగును పెద్దఎత్తున ఈ పథకం ద్వారా అధికారులు ప్రోత్సహిస్తున్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ఈ ఏడాది 13,853 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నరేగా ద్వారా సాయం అందించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఏటా వీటి సాగును పెంచడంద్వారా రైతుల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని భావిస్తున్నారు.**





మామిడి, బొప్పాయి, సపోట, జీడిమామిడి, కొబ్బరి వంటి ఉద్యాన పంటలే ఎక్కువ సాగుచేస్తున్నారు. ఎక్కువ ఆదాయం తెచ్చి పెట్టే పంటలు ఉన్నా పెట్టుబడికి భయపడుతున్నారు. అలాంటి వారికి నరేగా ద్వారా అదనపు సాయం అందించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. పండ్లు, పూల జాతులకు చెందిన 25 రకాల పంటలకు మూడేళ్ల పాటు పెట్టుబడి సాయం అందజేయనున్నారు. గతేడాది అనకాపల్లి జిల్లాలో వెయ్యి ఎకరాల్లో ఉద్యాన పంటల సాగును నరేగా ద్వారా చేపట్టారు. ఈ ఏడాదికి వచ్చేసరికి ఆ విస్తీర్ణ లక్ష్యం 3,500 ఎకరాలకు పెరిగింది. అల్లూరి జిల్లాలో గతేడాది ఆరు వేల ఎకరాలు లక్ష్యంగా పెట్టుకుంటే ఈ ఏడాది 10,353 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు చేపట్టాలని నిర్దేశించుకున్నారు.



### పెట్టుబడి సాయం ఇలా..

| తోట ( ఎకరాకి) | మొక్కలు | మూడేళ్లలో సాయం (రూ.ల్లో) |
|---|---|---|
| మామిడి | 70 | 1,09,950 |
| జీడి మామిడి | 70 | 98,684 |
| కొబ్బరి | 60 | 99,183 |
| నిమ్మ | 110 | 1,46,311 |
| జామ | 110 | 1,46,971 |
| తైవాన్ జామ | 444 | 2,51,224 |
| సపోట | 60 | 95,584 |
| సీతాఫలం | 240 | 2,14,178 |
| సిల్వర్ ఓక్ | 700 | 1,52,295 |
| పనస | 40 | 67,163 |
| డ్రాగన్ ఫ్రూట్ (50 సెంట్లు) | 900 | 2,00714 |
| గులాబీ (25 సెంట్లు) | 500 | 62,355 |
| మల్లెపూలు (25 సెంట్లు) | 400 | 55,124 |
| మునగ (25 సెంట్లు) | 112 | 27,515 |

### జాబ్ కార్డు ఉంటే చాలు..

అయిదెకరాల కంటే తక్కువ భూమి ఉన్న ఉద్యాన రైతులకు నరేగా ద్వారా పెట్టుబడి సాయం అందుతుంది. జాబ్ కార్డు కలిగి ఉండాలి. భూమి చదును చేయడం నుంచి మొక్కలు వేయడానికి గోతులు తీయడం.. నీరు పోయడం, ఎరువులు తదితర సంరక్షణ చర్యల కోసం రైతు ఖాతాకు నేరుగా సొమ్ములు జమ చేస్తారు. డ్రాగన్ ఫ్రూట్ సాగు ఏటా పెరుగుతోంది. సీతాఫలం, పనస, సిల్వర్ ఓక్ ఇతర పంటలు ఎక్కువగా సాగుచేస్తుంటారు. ఉపాధి పథకం అండగా నిలవడంతో ఎక్కువ మంది కొత్త పంటలు సాగుచేయడానికి ఆసక్తి చూపనున్నారు.

### బహుళ ప్రయోజనాలు..



ఉద్యాన పంటలకు ఉపాధిహామీ నుంచి సాయం అందించడం వల్ల బహుళ ప్రయోజనాలున్నాయి. రైతులపై పెట్టుబడి భారం పూర్తిగా తొలగిపోతుంది. వారి జీవన స్థాయి పెరుగుతుంది. పచ్చదనం విస్తరిస్తుంది. పూలతోటలకు పథకాన్ని వర్తింపజేయడం వల్ల మరింత మంది రైతులు లబ్ధి పొందడానికి ముందుకొచ్చే అవకాశం ఉంది.

–పూర్ణిమాదేవి, పీడీ, డ్వామా

## రామదండుకు ఉడతాభక్తిగా..




**అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం డముకు సమీపంలోని అడవుల్లో ఫల సాయం తగ్గిపోవడంతో కోతులన్నీ మైదాన ప్రాంతంలోకి గుంపులు గుంపులుగా వచ్చేస్తున్నాయి. వీటి ఆకలి గమనించిన విజయనగరం జిల్లా పిరమిడ్ సేవాదళ్ సభ్యులు వ్యానులో అరటిపండ్లు తీసుకొచ్చి ప్రేమగా అందిస్తున్నారు. ఇలా వారానికోమారు అరటి గెలలు తెచ్చి మూగజీవాల ఆకలి తీరుస్తున్నామని వివరించారు.**

– ఈనాడు, అరకులోయ

## ఆసుపత్రుల సేవలకు గుర్తింపు

*జి.మాడుగుల, అరకులోయ, న్యూస్‌టుడే:* అరకులోయ ప్రాంతీయ వైద్యకేంద్రం, జి.మాడుగుల ఆసుపత్రుల్లో అందిస్తున్న సేవలకు విశిష్ట గుర్తింపు లభించింది. నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) నిబంధనలకు అనుగుణంగా ఆసుపత్రిలో సేవలందిస్తున్నట్లు రిజిస్ట్రేషన్ గుర్తింపు పత్రాన్ని పంపించారు. కొద్దినెలల క్రితం దిల్లీ నుంచి ఎన్‌క్యూఏఎస్ బృందం ఈ ఆసుపత్రులను సందర్శించాయి. శుక్రవారం కలెక్టర్ దినేష్‌కుమార్ చేతులమీదుగా పాడేరులో వైద్యాధికారులు రాము, రవిచంద్రశేఖర్, శశికాంత్ గుర్తింపు పత్రాలు అందుకున్నారు.



జి.మాడుగుల వైద్యులు రవిచంద్రశేఖర్, శశికాంత్‌లకు అవార్డు అందిస్తున్న కలెక్టర్



## పడవ ఇలా.. రాకపోకలు ఎలా..!



గొడుగులపుట్టు వద్ద మత్స్యగెడ్డలో పడవ

జోలాపుట్టు జలాశయం పరిధిలో విస్తరించి ఉన్న మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతంలోని గ్రామాల గిరిజనులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుజనకోట పంచాయతీలోని 14 గ్రామాల ప్రజలు మత్స్యగెడ్డలో ఒక ఒడ్డు నుంచి మరో ఒడ్డుకు చేరేందుకు పన్నేండేళ్ల క్రితం పాడేరు ఐటీడీఏ స్టీమర్ ఇంజిన్ అమర్చిన పడవను అందించింది. దీన్ని నడిపేందుకు కొందరు గిరిజనులకు శిక్షణ ఇచ్చారు. అయితే దీనిపై అధికారులు పర్యవేక్షణ కరవైంది. ఇది మరమ్మతులకు గురై గొడుగులపుట్టు గ్రామ సమీపంలో మత్స్యగెడ్డ ఒడ్డున మూలకు చేరింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మత్స్యగెడ్డ ఉప్పొంగటంతో పడవ మునిగింది. దీంతో 14 గ్రామాల గిరిజనులు ఇబ్బందులకు గురవుతున్నారు. కుమ్మరిపుట్టు వద్ద తాడు ఆధారంగా నడుపుతున్న పడవను ఆశ్రయించి ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. రంధ్రాలు పడి పడవ లోపలికి నీరు చేరుతోందని గిరిజనులు భయపడుతున్నారు.

– ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

## నాణ్యమైన విద్య.. మెనూ అమలుపై దృష్టి



*రంపచోడవరం, న్యూస్‌టుడే:* రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతోపాటు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం పెట్టేందుకు చర్యలు తీసుకుంటామని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ **ఎ.విజయశాంతి** పేర్కొన్నారు. డిప్యూటీ డైరెక్టర్‌గా ఆమె శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బందితో సమావేశమై పలు అంశాలను సమీక్షించారు. అనంతరం ఆమె 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. దసరా సెలవులు ముగిసిన వెంటనే విద్యార్థులంతా పాఠశాలలకు వచ్చే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఉపాధ్యాయులంతా పాఠశాలలకు సక్రమంగా హాజరయ్యేలా చర్యలు చేపడతామని చెప్పారు. పిల్లలు అనారోగ్యానికి గురైతే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీలకు తీసుకెళ్లి వైద్యపరీక్షలు అందించేందుకు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ఉత్తీర్ణులయ్యేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్టీయూ నాయకులు లండా వేణుగోపాల్, గురుకుల ఉద్యోగుల సమస్యలపై గురుకుల జేఏసీ ప్రతినిధి మాదే రామచంద్రరావు డీడీ విజయశాంతిని కలిసి చర్చించారు.

## మోస్తరు వర్షాలు కురవొచ్చు

*చింతపల్లి, న్యూస్‌టుడే:* రానున్న ఐదు రోజుల్లో అల్లూరి జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఐదు రోజులూ ఆకాశం మేఘావృతమై మబ్బులతో నిండి ఉంటుందన్నారు. తేమతో కూడిన వాతావరణం ఉంటుందని పేర్కొన్నారు.

## వైభవంగా నవరాత్రి పూజలు



చింతపల్లి, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు చింతపల్లి మండలంలో ఘనంగా జరుగుతున్నాయి. పెదబరడ పంచాయతీ చినబరడ గ్రామంలో గ్రామస్థులు ఐదడుగుల అమ్మవారి విగ్రహాన్ని నెలకొల్పారు. ఈనెల 6న గ్రామంలోని అమ్మవారి ఆలయ మండపం వద్ద అగ్నిగుండం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

## భళా.. బాలల కళ..

అరకులోయ సమీపంలోని ఎండపల్లివలస ఏపీఆర్ పాఠశాల ఆవరణలో ఏకలవ్య పాఠశాలల ఐదో రాష్ట్ర స్థాయి సాంస్కృతిక ఉత్సవం ఉత్సాహంగా సాగుతోంది. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి.

7లో...



పాడేరు ఏకలవ్య పాఠశాల విద్యార్థినుల నృత్యం

## రాజవొమ్మంగి రేంజర్‌గా ఉషారాణి బాధ్యతల స్వీకరణ



రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగి అటవీక్షేత్రాధికారిణిగా జి.ఉషారాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అడ్డతీగల రేంజ్ అధికారిగా (లాగింగ్) పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు రాజవొమ్మంగి రేంజర్‌గా పనిచేసిన ఎం.అబ్బాయి దొర చింతూరు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు.



## కేజీ టమాటా రూ. 90



*డుంబ్రిగుడ, న్యూస్‌టుడే:* మన్యంలో టమాటా ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలతో ఈ పంట దెబ్బతింది. మైదాన ప్రాంతం నుంచి దిగుమతి అవుతోంది. 20 కేజీల సరకు రూ.2 వేల వరకు విక్రయిస్తున్నారు. అరుకు సంతబయలులో శుక్రవారం జరిగిన సంతలో కేజీ రూ.90 చొప్పున విక్రయించారు. తప్పనిసరి పరిస్థితిల్లో కొనుగోలు చేయాల్సి వస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అవివాహితులకు సువర్ణావకాశం

### నేడు, రేపు కాపు/ తెలగ అవివాహిత వధూవరులకు 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి కాపు/తెలగ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్, రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. విశాఖపట్నం అక్కయ్యపాలెం అబీద్‌నగర్‌లోని రత్నమాల రెసిడెన్సీలో ఈనాడు కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (శనివారం, అక్టోబరు 5న), రేపు (ఆదివారం, అక్టోబరు 6న) ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 91549 18858, 80080 01686 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు. ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలను పైన తెలిపిన వాట్సాప్ నెంబర్లకు పంపవచ్చు. - న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

## ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని వినతి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేసినట్లు అరకు పార్లమెంట్ టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి తెలిపారు. తెదేపా జాతీయ కార్యాలయంలో రాష్ట్ర టీఎన్‌టీయూసీ సమావేశంలో పాల్గొని గిరిజన కార్మికులు, ఉద్యోగుల సమస్యలను వివరించినట్లు పేర్కొన్నారు.



తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న స్వామి

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: గిరిజన గ్రామాలకు తారురోడ్డు నిర్మించాలని లక్ష్మీపురం పంచాయతీ సర్పంచి త్రినాథ్, ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు శ్రీను.. మంత్రి ఎండీఎన్ ఫరూక్‌కి వినతిపత్రం అందించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మంత్రిని కలిశారు. లక్ష్మీపురం పంచాయతీలోని దొరగుడ, బొక్కాయిగుడ, కించాయిపుట్టు పంచాయతీలోని తేనేలమామిడి, మినుములపుట్టు గ్రామాలకు తారురోడ్డు సదుపాయం కల్పించాలని కోరారు.

# అంతటా కొరత.. నిత్యం కలత

★ ఉక్కులో తగ్గిపోతున్న మానవ వనరులు

★ ఖనిజాలు.. నిధుల లభ్యతదీ ఇదే పరిస్థితి

న్యూస్‌టుడే, ఉక్కునగరం(స్టీల్‌సెక్టార్-3)

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పూర్తి స్థాయిలో నడుపుతామంటూ ఇటీవల కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాసవర్మ ప్రకటనలు చేశారు. 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యం గల కర్మాగారాన్ని పూర్తిస్థాయిలో నడపాలంటే ఎంతమంది ఈడీలు, సీజీఎంలు, సిబ్బంది ఉండాలి..? ప్రస్తుతం ఎంతమంది ఉన్నారనేది కనీస పరిశీలన చేయకుండానే ప్రకటనలు చేసేశారని కార్మిక నాయకులు ఆరోపిస్తున్నారు.




మానవ వనరుల కొరత ఉన్నా.. సంస్థలో నిరంతరం ఉత్పత్తి సాధించేందుకు కార్మికులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. అయితే కేంద్రం ఉక్కుశాఖ మాత్రం తాజాగా 4 వేల మంది ఒప్పంద కార్మికుల్ని తొలగించేందుకు ఇటీవల చేసిన కొన్ని ప్రయత్నాలు కలకలం రేపాయి. చివరికి ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి జోక్యం చేసుకొని పరిస్థితి చక్కదిద్దినా...ఉద్యోగుల్లో ఆందోళన మాత్రం వీడలేదు.

ఇదీ పరిస్థితి: ఓవైపు ముడిసరకు కొరత, ఇంకో వైపు ఉత్పత్తికి అవసరమైన నిధులు కరవు.. మరోవైపు ఉద్యోగ విరమణలు, అవసరమైన మేరకు సిబ్బందిని భర్తీ చేయకపోవడం... ఇలాంటి కారణాలతో క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సకాలంలో సరైన నిర్ణయాలు, ప్రణాళికలు అమలు చేసే పరిస్థితి లేకపోవడంతో కర్మాగారం అభివృద్ధికి ఆటంకాలు ఎదురవుతున్నాయి.



● రూ. లక్షల కోట్ల విలువైన కర్మాగారాన్ని నడిపే ప్రధాన అధికారి అయిన సీఎండీ పోస్టు... ప్రస్తుతం ఇన్‌ఛార్జితో నడుస్తుంది. 14 మంది ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు(ఈడీలు) ఉండాల్సి ఉన్నా... ఒక్కరూ లేరు. 72 మంది సీజీఎంలకు కేవలం ఆరుగురే ఉన్నారు. జీఎంలు 20 నుంచి 30 మంది తక్కువగానే ఉన్నారు.

● మిగిలిన కిందిస్థాయి యువ అధికారుల్లో చాలామంది గత నాలుగేళ్ల నుంచి విశాఖ ఉక్కును వీడి బయటకు వెళ్లిపోయారని హెచ్‌ఆర్ విభాగం అధికారులు చెబుతున్నారు. టెక్నీషియన్లు, ఛార్జ్‌మెన్లు, జేఓలు సంఖ్య తక్కువగానే ఉంది.

● ఇలాంటి పరిస్థితుల్లో ఇంకా సిబ్బందిని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు... కర్మాగారాన్ని ఎటువైపు తీసుకెళ్తాయోనని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కేంద్రం తన వైఖరిని మార్చుకుని కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేస్తేనే విశాఖ ఉక్కు మనుగడ సాధ్యమవుతుందని కార్మికులు చెబుతున్నారు.

## తపాలా సేవలు విస్తృతం చేయండి

పాడేరు, న్యూస్‌టుడే: తపాలా శాఖ అందిస్తున్న సేవలపై గ్రామాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పాడేరు డివిజన్ ఐపీ వై. దిలీప్ అన్నారు. శుక్రవారం హుకుంపేట సబ్ డివిజన్ పరిధిలోని పనిచేస్తున్న బ్రాంచి పోస్టుమాస్టర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈ నెల 9న తేదీన జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా వారోత్సవాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఎంఓలు కిషోర్, రవికుమార్ పాల్గొన్నారు.



బ్రాంచి పోస్టుమాస్టర్లకు అవగాహన కల్పిస్తున్న పాడేరు డివిజన్ ఐపీ దిలీప్

## సాంకేతిక సాయంతో సులభతర వ్యవసాయం

చింతపల్లి, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతాల్లోని రైతులు సాగులో ఆధునిక సాంకేతిక విధానాలను ఆచరించాలని, దీనివల్ల సాగు సులభతరం అవుతుందని డిజిటల్ గ్రీన్ ప్రతినిధి శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం చింతపల్లిలో రైతులకు ఫార్మర్ చాట్ అనే యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ యాప్‌ను రైతులు వినియోగించడం వల్ల పంటల్లో తెగుళ్ల నివారణ చర్యలతోపాటు వాతావరణం వంటి అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. గిరిజన రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న శ్రీకాంత్

## ట్రైకార్ ఛైర్మన్‌ను కలిసిన తెలుగు యువత నేతలు

ఎటపాక, న్యూస్‌టుడే: రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల ఆర్థిక సహకార సంఘం (ట్రైకార్) నూతన ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బొగరం శ్రీనివాసులును తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బొర్రా నరేష్‌కుమార్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి భద్రాచల సీతారాముల వారి ప్రతిమను అందజేశారు. రంపచోడవరం, చింతూరు డివిజన్ల ఏజెన్సీ ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలను ఆయనకు వివరించారు.



శ్రీనివాసులును సత్కరిస్తున్న తెలుగు యువత నేతలు

## వైద్య విద్యార్థినికి సన్మానం



జోషిత, ఆమె తండ్రిని సన్మానిస్తున్న ఆటా నాయకులు

ఎటపాక, న్యూస్‌టుడే: నీట్ - 2024 సంవత్సరంలో జాతీయ స్థాయిలో మంచి ర్యాంకు సాధించి విజయవాడ పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలలో మొదటి ఫేజ్‌లోనే సీటు పొందిన ఆదివాసీ ఉద్యమ నేత సున్నం వెంకటరమణ, రాజ్యలక్ష్మి దంపతుల కుమార్తె సున్నం జోషితను శుక్రవారం పాండురంగాపురంలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఆటా) ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆటా రాష్ట్ర కార్యదర్శి పూసం శ్రీను మాట్లాడుతూ జోషిత వైద్య సీటు సాధించడం ఆదివాసీ సమాజానికి ఎంతో గర్వకారణమన్నారు. ఆటా ప్రధాన కార్యదర్శి కణితి రామకృష్ణ, మండల అధ్యక్షులు కాకా రాజు, జిల్లా కార్యదర్శి పాయం ప్రసాద్, ఇరకం కాంతారావు, డాక్టర్ తుర్రం రామకృష్ణ పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారంలో శ్రద్ధ చూపండి

### కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు, న్యూస్‌టుడే: ప్రజల ఫిర్యాదులు పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మీ కోసం- ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జేసీ అభిషేక్ గౌడ, ఐటీడీఏ పీఓ వి. అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డీఆర్ఓ పద్మావతి.. అర్జీదారుల నుంచి 177 వినతులు స్వీకరించారు. చింతపల్లి మండలం బెన్నవరం పంచాయతీ పోతురాజుగమ్ములు గ్రామస్థులు జి. సత్తిబాబు, జి. మోహన్‌రావు తదితరులు అటవీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. డుంబ్రిగుడ మండలం తూటంగి పంచాయతీ బుడ్డింగి గ్రామస్థులు దాసుబాబు, కామేశ్వరరావు.. జర్రాయి నుంచి బుడ్డింగి గ్రామానికి రోడ్డు నిర్మించాలని కోరారు. ముంచంగిపుట్టు మండలం కిలగాడ గ్రామస్థులు ఎం. లక్ష్మి, చంద్రమ్మ తదితరులు పి.ఎం. జన్‌మన్ ఇళ్ల నిర్మాణ బిల్లులు చెల్లించాలని విన్నవించారు. కొయ్యూరు మండలం చౌడుపల్లి గ్రామంలో రేషన్ డిపో ఏర్పాటు చేయాలని చిన్నారావు, సంజీవరావు, సర్పంచి ఎస్ ముత్యాలమ్మ తదితరులు వినతిపత్రం అందజేశారు. జిల్లా పంచాయతీ అధికారి టి. కొండలరావు, వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్ నంద్, ఉద్యానాధికారి రమేష్‌కుమార్‌రావు, గిరిజన సంక్షేమశాఖ ఈఈలు డీవీఆర్ఎం రాజు, వేణుగోపాల్, గ్రామీణ నీటిసరఫరా విభాగం ఈఈ జవహర్‌కుమార్, డీఎల్‌పీఓ పి. యస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న జేసీ అభిషేక్ గౌడ, ఐటీడీఏ పీఓ అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్

### ప్రజల విశ్వాసాన్ని పొందండి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు ప్రజల విశ్వాసాన్ని పొందాలని, జాతీయ నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లాలోని 18 ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) ధ్రువపత్రాలు ఆయా వైద్యులకు అందజేశారు. జిల్లా పరిధిలో మూడు (అరకు, చింతపల్లి, కూనవరం) ప్రాంతీయ ఆసుపత్రులు, ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(ఇందుకూరుపేట, తాజంగి, సప్పర్ల, పిడతమామిడి, జి. మాడుగుల, ఎల్లవరం, లాగరాయి), ఆరు (ముసిరిమల్లి, గుత్తులపుట్టు, అడుగులపుట్టు, కొత్తపాడేరు, నెల్లిపూడి, చింతూరు) సబ్ సెంటర్లు, రెండు హెల్త్‌వెల్‌నెస్ సెంటర్లకు ఆయా ధ్రువపత్రాలు మంజూరయ్యాయి. జేసీ అభిషేక్ గౌడ, ఐటీడీఏ పీఓ వి. అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డీఆర్ఓ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలు ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పండి

గోకవరం, దేవీపట్నం, న్యూస్‌టుడే: అద్దె ఇళ్లల్లో అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని, తమకు కేటాయించిన కాలనీలు ఎప్పటికి పూర్తవుతాయో చెప్పాలంటూ పోలవరం నిర్వాసితులు నిలదీశారు. శుక్రవారం నిర్మాణంలో ఉన్న పునరావాస కాలనీల సందర్శనకు వచ్చిన పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో అతుల్ జైన్‌తో పాటు రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీల వాహనాలను వారు అడ్డుకున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం తూర్పుగోదావరి జిల్లా గోకవరం శివారున గంగాలమ్మ ఆలయం సమీపంలో కాలనీలు నిర్మిస్తున్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పనులు ఏమాత్రం ముందుకు సాగలేదు. పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన అథారిటీ సీఈవో అతుల్ జైన్ పర్యటనలో భాగంగా గోకవరంలోని దేవీపట్నం ముంపు గ్రామానికి నిర్మిస్తున్న పునరావాస కాలనీని సందర్శించారు. మూడేళ్లుగా కాలనీ నిర్మాణాలు పూర్తికాక అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నిర్వాసితులు ఆయన వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. సందర్శన అనంతరం ఆయన తిరిగి ప్రయాణమయ్యారు. అయితే పక్కనే ఉన్న తమ కాలనీని సందర్శించకుండా వెళ్లిపోతున్నారని మండిపడిన ముప్పై మంది పూడిపల్లి కాలనీ నిర్వాసితులు ప్రధాన రహదారిపై బైఠాయించి అధికారుల వాహనాలను అడ్డుకున్నారు. కాలనీ నిర్మాణాలు పూర్తికాక నరకం అనుభవిస్తున్నామని, అధికారులు తమ సమస్యలను పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీలు వీరితో మాట్లాడి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. సుమారు అరగంట పాటు వీరు అడ్డుకోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్సై పవన్‌కుమార్ సిబ్బంది వారితో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు.



పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో అతుల్ జైన్‌కు సమస్యలను వివరిస్తున్న నిర్వాసితులు



రోడ్డుపై బైఠాయించిన నిర్వాసితులు

## వేంకటేశ్వరుని ఆలయాన్ని దర్శించుకున్న ఉన్నతాధికారులు



వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఆర్అండ్ఆర్ సీఈవో అతుల్‌జైన్, పీవో సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం మండలం ఐ.పోలవరంలో గోవిందగిరిపై వెంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శుక్రవారం సాయంత్రం ఆర్అండ్ఆర్ సీఈవో అతుల్‌జైన్, రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ దర్శించుకున్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి దేవీపట్నం మండలంలో నిర్వాసితులకు గోకవరం, ఇందుకూరుపేట సమీపంలో నిర్మించిన పునరావాస కాలనీలను అధికారుల బృందం సందర్శించింది. మార్గమధ్యలో ఉన్న వెంకటేశ్వరుని ఆలయాన్ని దర్శించుకొని మారేడుమిల్లి పయనమయ్యారు. గిరిజన సంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఐ. శ్రీనివాసరావు, డీఈ చైతన్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మళ్లీ మొదలైన బియ్యం అక్రమ రవాణా?

దేవీపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని రేషన్ బియ్యం అక్రమ రవాణా మళ్లీ మొదలైందని భావిస్తున్నారు. మైదాన ప్రాంతాలకు ఆటోపై తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఇటీవల రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టుకున్న విషయం తెలిసిందే. అప్పట్లో ఈ బియ్యం అక్రమ రవాణా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో పెద్ద దుమారమే రేగింది. దీంతో కొంతకాలంగా ఈ వ్యవహారం సద్దుమణిగింది. తాజాగా ఉప్పయ్యపాలెం కూడలి నుంచి మైదాన ప్రాంతాలకు రేషన్ బియ్యం తరలిస్తున్న విషయం శుక్రవారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది.

## రైతులు రుణాలు రీషెడ్యూల్ చేసుకోవచ్చు

పాడేరు, న్యూస్‌టుడే: ఇటీవల వరదలతో రైతులకు కలిగిన నష్టాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం అల్లూరి జిల్లాను ప్రకృతి వైపరీత్యాల జిల్లాగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఏడాదిపాటు మారిటోరియం ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీన్ని ప్రకారం రైతులు రుణాలను రీ షెడ్యూల్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పేదల జీవన ప్రమాణాలు మెరుగుకు బ్యాంకులు సహకారం అందించాలని సూచించారు. జేసీ ఎంజె అభిషేక్ గౌడ, ఎల్డీఎం మాతునాయుడు, యూనియన్ బ్యాంకు కన్వీనర్ జి.వి.బి.డి. హరిప్రసాద్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి యువకుడి మృతి

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం మండలం తాళ్లపాలెం చెరువులో పడి శంబర కృష్ణశర్మ (33) మృతి చెందాడు. సీఐ రవికుమార్ కథనం ప్రకారం.. మద్యం మత్తులో ఉన్న కృష్ణశర్మ కాలకృత్యాలు తీర్చుకొనేందుకు గురువారం రాత్రి తాళ్లపాలెంలో చెరువు వద్దకు వెళ్లాడు. చెరువుకు వెళ్లిన భర్త ఎంతకూ రాకపోవడంతో భార్య సీత వెళ్లి చూడగా చెరువులో పడి మృతి చెందినట్లు గుర్తించారని సీఐ తెలిపారు. శవపరీక్ష నిమిత్తం శుక్రవారం కృష్ణశర్మ మృతదేహాన్ని రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్యతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రవికుమార్, ఎస్సై సాధిక్ తెలిపారు.

### అనారోగ్యంతో విద్యార్థి..

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: పెదబయలు మండలం సీకరి గిరిజన సంక్షేమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న వెచ్చంగి కాంతారావు(14) అనారోగ్యంతో మృతి చెందాడు. సీకరి పంచాయతీ చిట్టంరాయి గ్రామానికి చెందిన బాలుడు దసరా సెలవులకు ఒకటో తేదీన స్వగ్రామానికి వెళ్లాడు. రెండో తేదీన పాఠశాలకు తల్లితోపాటు వచ్చి తన వస్తువులు తీసుకెళ్లాడు. గురువారం ఉదయం స్నేహితులతో కలిసి కర్రలకు వెళ్లి వచ్చాడు. రాత్రి పదిగంటల సమయంలో కాంతారావు వాంతి చేసుకున్నాడు. వెంటనే కాళ్లు, చేతులు పనిచేయకపోవడంతో హుటాహుటిన పెదబయలు ఆసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటికే మృతి చెందాడని వైద్యుడు నిఖిల్ తెలిపారు. తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. ఈ విద్యార్థికి గత సంవత్సరం ఆరోగ్యం బాగోలేకపోవడంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొంది కోలుకున్నాడని ప్రధానోపాధ్యాయుడు చలపతిరావు తెలిపారు.

### మత్స్యగెడ్డలో గుర్తుతెలియని మృతదేహం

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: సీతగుంట సమీపంలోని మత్స్యగెడ్డలో శుక్రవారం ఉదయం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. పంచాయతీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందిండంతో వారు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి వయస్సు సుమారు 30 సంవత్సరాలు ఉండొచ్చని ఎస్సై రమణ తెలిపారు. సర్పంచి మాధవరావు, పంచాయతీ సిబ్బంది సాయంతో మృతదేహాన్ని పాడేరు జిల్లా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ఘాట్‌రోడ్డులో లారీ, ద్విచక్రవాహనం ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. అరకులోయ నుంచి మైదాన ప్రాంతానికి వస్తున్న లారీ అరకులోయ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం శివలింగపురం సమీపంలోని 1వ నంబర్ మలుపు సమీపంలో ఢీకొన్నాయి. ద్విచక్రవాహనదారుడికి గాయాలవ్వడంతో శృంగవరపుకోట ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు అనంతగిరి ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.



ఘటనాస్థలంలో వాహనాలు

## భారీగా గంజాయి స్వాధీనం

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు సమీపంలోని గుంటవాడ జలాశయం సమీపంలో రూ.11 లక్షల విలువ చేసే 223 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జె. రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గురువారం సాయంత్రం గుంటవాడ జలాశయం సమీపంలో వాహన తనిఖీలు చేస్తుండగా.. పోలీసులను చూసి వెనక్కి తిప్పబోయిన వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులోని పది బస్తాల్లోని ఉన్న గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆటో, రెండు సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఆరుగురు నిందితుల్లో ముగ్గురిని అరెస్ట్‌చేయగా, మరో ముగ్గురు పరారయ్యారు. వీరితోపాటు ఈకేసుతో సంబంధం ఉన్న మరో ఇద్దరి ఆచూకీ కోసం కూడా గాలిస్తున్నామన్నారు.




స్వాధీనం చేసుకున్న గంజాయితో సీలేరు పోలీసులు

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: మన్యం నుంచి నుంచి మైదానానికి తరలిస్తున్న 181 కేజీల గంజాయిని కృష్ణదేవిపేట పోలీసులు పట్టుకున్నారు. ఇన్‌ఛార్జి ఎస్.ఐ. సీహెచ్. భీమరాజు కథనం ప్రకారం.. కృష్ణదేవిపేట అల్లూరి సీతారామరాజు నందనవనం వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు.

గూడెంకొత్తవీధి మండలం నుంచి వస్తున్న ఆటోలో గంజాయి గుర్తించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం వట్టిబూసల గ్రామానికి చెందిన గెమ్మిల రవి, సరమండ గ్రామానికి చెందిన పాంగి శాంతి, టి. మల్లేష్, చింతపల్లి మండలానికి చెందిన గమ్మిల కిరణ్‌ను పట్టుకొని అరెస్టు చేశామని భీమరాజు తెలిపారు. గంజాయితోపాటు ఆటో, 4సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

## రహదారిని బాగుచేయాలి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: కరకవలస రోడ్డు మరమ్మతులు చేపట్టకుంటే రైల్వే వంతెన పనులను అడ్డుకుంటామని గిరిజన సంఘం నాయకులు పేర్కొన్నారు. రైల్వే రెండోలైన్ నిర్మాణంలో భాగంగా చేపడుతున్న వంతెన నిర్మాణ పనుల్లో భారీ వాహనాలతో ధ్వంసమైన కరకవలస రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ గిరిజన సంఘం నాయకులు బుజ్జిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్ ఆధ్వర్యంలో శుక్రవారం సంబంధిత ఇంజినీరింగు అధికారులకు వినతిపత్రం అందజేశారు. గన్నెల కూడలి నుంచి కరకవలస రైల్వేస్టేషను వరకు ఉన్న బీటీ రోడ్డులో కనీసం ద్విచక్రవాహన ప్రయాణానికి ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బొండాం పంచాయతీ, అనంతగిరి మండలంలోని పలుగ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గిరిజన సంఘం నాయకులు జోషి, గ్రామస్థులు కృష్ణ, జయరాం, దాసు, దేవరాజు, రవీంద్రబాబు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



అరకులోయ రైల్వే ఇంజనీరింగ్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న గిరిజనసంఘం నాయకులు

## టెండర్ ప్రకటన



## గమ్యం లేకుండా వెళుతున్న బాలిక సదనానికి తరలింపు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : గమ్యం లేకుండా వెళుతున్న ఓ బాలికను పోలీసులు బాల సదనానికి అప్పగించిచారు. వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు రోడ్ కం రైలు వంతెనపై శుక్రవారం ఉదయం పదేళ్ల వయస్సు గల బాలిక నడుచుకుంటూ వెళుతుండగా అటుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న సచివాలయ కార్యదర్శి తేజ చూసి ఎవరమ్మా, ఎక్కడికి వెళుతున్నావని అడగ్గా వంతెన దాటితే మా ఊరొస్తుందని చెప్పడంతో వాహనం ఎక్కించుకుని టోల్‌గేటు వరకు తీసుకొచ్చారు. మీ ఇల్లు ఎక్కడ అని అడిగితే సరైన సమాధానం చెప్పకపోవడంతో పట్టణ స్టేషనుకు తీసుకొచ్చారు. సీఐ విశ్వం బాలికతో మాట్లాడగా తన పేరు కాకరి మోక్షితని, అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం దొంతురాయి అని చెప్పింది. కొన్నాళ్లుగా రాజమహేంద్రవరంలో ఉంటున్నానని వివరించింది. దీంతో ఆయన ఐసీడీఎస్ సూపర్‌వైజరు విజయలక్ష్మి, సిబ్బంది ద్వారా బాలికను రాజమహేంద్రవరంలోని బాలసదన్‌కు పంపించి, ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

## దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగానే..




మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబు

సీలేరు, న్యూస్‌టుడే: ఎ.దారకొండ పంచాయతీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని గ్రామసభలో తీర్మానం చేశారు. శుక్రవారం జరిగిన గ్రామసభలో ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ తమ పంచాయతీ అభివృద్ధికి నోచుకోలేదని పేర్కొన్నారు. కనీసం సరైన రహదారి లేకపోవడంతో గిరిజనులంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సర్పంచి ముర్ల సత్యవతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి రాధ, సంక్షేమ సహాయకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రాయితీలు సద్వినియోగం చేసుకోండి

కూనవరం, న్యూస్‌టుడే: రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని భాజపా జిల్లా కార్యదర్శి పాయం వెంకయ్య కోరారు. పెదార్కూరులో రాయితీ ఎరువులను రైతులకు ఆయన సర్పంచి నాగమణి కలసి అందించారు. రైతులు పంటల యాజమాన్య పద్ధతులను వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి తెలుసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు అమ్మాజీ, సురేశ్, వ్యవసాయశాఖ సిబ్బంది వంశీ, రైతులు పాల్గొన్నారు.



ఎరువులు అందిస్తున్న సర్పంచి తదితరులు

## కొరాపుట్-అరకు సెక్షన్‌లో తనిఖీలు

విశాఖపట్నం: తూర్పు కోస్తా రైల్వే డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్ శుక్రవారం కొరాపుట్- అరకు సెక్షన్‌లో తనిఖీలు నిర్వహించారు. కొరాపుట్ రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన ఆయన యార్డు, యాక్సిడెంట్ రిలీఫ్ రైలుతోపాటు భద్రతా సామగ్రిని పరిశీలించారు.

### చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 114 | 110 |
| లైవ్ | 136 | 130 |
| డ్రెస్డ్ | 197 | 230 |
| స్కిన్‌లెస్ | 224 | 240 |

# భళా.. బాలల కళ..



చింతూరు పాఠశాల విద్యార్థుల ప్రదర్శన



దుర్గాదేవి వేషధారణలో..

అరకులోయ, న్యూస్‌టుడే: ఎండపల్లివలస ఏపీఆర్ పాఠశాల ఆవరణలో ఏకలవ్య పాఠశాలల ఐదో రాష్ట్రస్థాయి సాంస్కృతిక ఉత్సవం రెండో రోజు శుక్రవారం సందడిగా సాగింది. శుక్రవారం విద్యార్థులు నృత్యాలతో హోరెత్తించారు. రాష్ట్రంలోని 28 ఏకలవ్య పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు నృత్యం, ఏకపాత్రాభినయం, పాటలు, ఫోక్ సాంగ్, మిమిక్రీ, మ్యాజిక్‌తోపాటు 32 విభాగాల్లో తమ ప్రతిభ చాటుతూ ప్రదర్శనలు ఇచ్చారు. సుమారు 800 మంది విద్యార్థులతో పాఠశాల ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. శనివారంతో ఇది ముగియనుంది. ఫెస్ట్ కన్వీనర్ భాస్కరరావు, గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ పీఏస్ఎన్ మూర్తి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతోంది.

## ఆరు పీహెచ్‌సీల మంజూరుకు ప్రతిపాదనలు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: జిల్లాలో ఆరు పీహెచ్‌సీలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని వైద్యారోగ్య శాఖ జిల్లా అధికారి జమాల్‌బాషా తెలిపారు. శుక్రవారం ఆయన కిల్లోగుడ, డుంబ్రిగుడ పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. రోగుల వివరాలు, సిబ్బంది హాజరు, గదులు పరిశీలించారు. మలేరియా, టైఫాయిడ్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అప్పుడే బిడ్డకు బీసీజీ టీకా తప్పనిసరిగా వేయాలని సూచించారు. వైద్యాధికారులు, సిబ్బందిని ప్రభుత్వాన్ని కోరామన్నారు.



డుంబ్రిగుడలో బాలింతకు వైద్య పరీక్షలు చేస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

# అరుదైన సంపద ఆవిరి!

గణనీయంగా తగ్గిన నరమామిడి, కోవెల జిగురు సేకరణ

గిరిజనుల ఆదాయానికి గండి



గిరి రైతులు సేకరిస్తున్న కోవెల జిగురు

**అవగాహన లోపంతో అడవులు అంతరించిపోతున్నాయి. అరుదైన వృక్ష సంపద కనుమరుగవుతోంది. ఆదివాసీల పోడు వ్యవసాయం పచ్చని వృక్షాలకు శాపమవుతోంది. అనేక వ్యాధులకు దివ్య, ఔషధమైన నరమామిడి, కోవెల జిగురు వంటి వృక్షాలు నానాటికీ తగ్గిపోతున్నాయి. వీటిని కాపాడుకునేందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి, గిరిజనులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.**

– పాడేరు, న్యూస్‌టుడే

కొన్నేళ్ల క్రితం వరకు మన్యంలో ఎక్కడ చూసిన దట్టమైన అడవులు ఉండేవి. ఇక్కడి అటవీ ఉత్పత్తులు గిరిజనులకు ఆదాయాన్ని తెచ్చి పెట్టేవి. ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. పెరిగిన జనాభా, వ్యవసాయం కోసం ఇరత ప్రాంతాల నుంచి వచ్చిన ఆదివాసీలు పచ్చని చెట్లను విచక్షణారహితంగా నరికేస్తున్నారు. దీంతో నరమామిడి, కోవెల జిగురు వంటి విలువైన వృక్షాలు కనుమరుగవుతున్నాయి. ఒకప్పుడు ఈ చెట్ల ద్వారా గిరిజనులు మంచి ఆదాయాన్ని పొందేవారు. పోడు వ్యవసాయం పేరిట అడవుల నరికివేత వల్ల ఈ వృక్షాలు తగ్గిపోవటమే కాకుండా గిరిజనుల ఆదాయానికి గండి పడుతోంది. ఈ చెట్ల నుంచి చెక్కను తీయడంలో శాస్త్రీయ విధానాలు పాటించకపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. చెక్కలు తీసిన అనేక నరమామిడి వృక్షాలు ఎండిపోయాయి. జీసీసీ ధరలను రెట్టింపు చేసినా ఫలితం ఉండటం లేదు. చెట్లు లేనిదే చెక్క సేకరణ ఎలా సాధ్యమని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు.

### ఔషధాల తయారీలో కీలకం

పలు ఔషధాల తయారీలో నరమామిడి, కోవెల జిగురు కీలకమైనవి. నరమామిడి చెక్క అగరవత్తుల తయారీలో వినియోగిస్తారు. వీటికి ఇతర రసాయనాలు జత చేయడంతో సువాసన వెదజల్లుతోంది. ఇది లేకుండా అగరవత్తుల తయారీ సాధ్యం కాదు. దీనికి ఎనలేని డిమాండ్ ఉంది. ఎంత చెక్క వచ్చినా కొనుగోలు చేసేందుకు జీసీసీ సిద్ధంగా ఉంది.

### ఆదాయం కోల్పోతున్న జీసీసీ

నరమామిడి, కోవెల జిగురు వంటి విలువైన వృక్ష సంపద కనుమరుగవడంతో గిరిజన సహకార సంస్థ ఆదాయం కోల్పోతోంది. అధికారిక లెక్కల ప్రకారం 15 ఏళ్ల క్రితం పాడేరు డివిజన్ కేంద్రంలో సుమారు 90 టన్నుల నరమామిడి చెక్క లభించేది. అది ప్రస్తుతం 20 టన్నులు కూడా రాకపోవడం గమనార్హం. మొదట్లో కిలో చెక్క జీసీసీ రూ.16 లకు కొనుగోలు చేసేది. ప్రస్తుతం దీని ధర రూ.32లకు పెంచింది. కోవెల జిగురు మొదటి రకం రూ.270, రెండో రకం రూ.220కు కొనుగోలు చేస్తున్నారు.



నరమామిడి చెట్టు

**గిరిజనులకు నష్టం**

పదేళ్ల క్రితం మన్యంలో ఎక్కడ చూసినా నరమామిడి, కోవెల జిగురు వృక్షాలు విరివిగా కనిపించేవి. చెక్క, జిగురు సేకరణ కూడా సులభంగా ఉండేది. ఆదాయం కూడా అశాజనంగా వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడంలేదు. అడవుల్లో వృక్షాలు కనిపించడం లేదు. మన్యంలో అటవీ ఉత్పత్తులన్నీ క్రమంగా అంతరించిపోతున్నాయి. దీనివల్ల గిరిజనులకు తీవ్ర నష్టం జరుగుతుంది.

– బి.మోహన్‌రావు, గుత్తులపుట్టు, పాడేరు మండలం

**రైతులకు అవగాహన కల్పిస్తున్నాం**

మన్యంలో కనుమరుగవుతున్న విలువైన వృక్ష సంపదను కాపాడుకునేందుకు జీసీసీ ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. అటవీ శాఖ సహకారంతో అంతరించిపోతున్న వృక్షాలు తిరిగి పెంచడానికి చర్యలు తీసుకుంటాం. గిరిజనులకు ఆదాయ వనరులైన అటవీ ఉత్పత్తులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనికి గిరిజనులు సహకరించాలి.

– సింహాచలం, జీసీసీ డీఎం పాడేరు

## అ వీ ఇ వీ

### ఎన్నికల హామీలు అమలు చేయండి

రంపచోడవరం, న్యూస్‌టుడే: మద్యం అమ్మకాల్లో 30 శాతం తగ్గుదల దిశగా నూతన ఎక్సైజ్ విధానం ఉండేలా సవరించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజా దూలయ్య డిమాండ్ చేశారు. స్థానిక మార్క్స్ ఏంగిల్స్ భవనంలో శుక్రవారం ఏఐకేఎంఎస్‌తోపాటు పీడీఎస్‌యూ, పీవైఎల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దూలయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎన్టీఆర్ పాలన కొనసాగిస్తామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. నాగరాజు, కత్తుల బాలురెడ్డి, ఐ.రమణ, పల్లాల లచ్చిరెడ్డి, అనసూయ, జోగమ్మ, మురళి పాల్గొన్నారు.

### బాలారంలో బైక్ చోరీ

కొయ్యూరు, న్యూస్‌టుడే: బాలారంలో మొండెం రాజుకు చెందిన ద్విచక్రవాహనం బుధవారం రాత్రి చోరీకి గురైంది. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### నీళ్ల డబ్బాల వితరణ

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొండసంత, డౌనూరు గ్రామాల్లోని మహిళలకు ఎస్ఎన్ఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 3020, సీఫా సంస్థల ఆధ్వర్యంలో నీళ్ల డబ్బాలు పంపిణీ చేశారు. రోటరీ సంస్థ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, రోటరీ అధ్యక్షులు బి.వినయ్ గాంధీ, కార్యదర్శి మణిమాల, బి.మధు, డీఎం రావు తదితరులు పాల్గొన్నారు.

### ఆరు మద్యం దుకాణాలకు అనుమతి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఆరు మద్యం దుకాణాలకు అనుమతి వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ కూర్మారావు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. చింతపల్లిలో 3, కొయ్యూరు 1, గూడెంకొత్తవీధి మండలంలో 2 షాపులు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. నూతన దుకాణాల కోసం ఈనెల 9వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. 11వ తేదీన పాడేరులోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లాటరీ తీస్తామని చెప్పారు. ఎక్సైజ్ ఎస్సై కరుణప్రసాద్, కానిస్టేబుళ్లు నాయుడు, రమేష్ పాల్గొన్నారు.

### జంతువుల సంరక్షణ అందరి బాధ్యత

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: జంతు సంపదను పరిరక్షించడం, వాటిని వృద్ధి చేయడం మనందరి బాధ్యతని చింతపల్లి డిగ్రీ ప్రిన్సిపల్ విజయభారతి అన్నారు. శుక్రవారం కళాశాలలో జంతువుల సంరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### తెదేపా మండల సమావేశం 10న

జి.మాడుగుల, న్యూస్‌టుడే: ఈనెల 10న తెదేపా మండల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు కొండలరావు తెలిపారు. శ్రేణులు హాజరుకావాలన్నారు.

### రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: టోకూరు పంచాయతీ జాకరవలసలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచి కిల్లో మోస్య శంకుస్థాపన చేశారు. రామ్మూర్తి, దొన్ను, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# గాయత్రీ దేవిగా దుర్గమ్మ

ఎటపాక, న్యూస్‌టుడే: ఎటపాక, తోటపల్లి, నెల్లిపాక, గుండాల గ్రామాలతోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం అమ్మవారు గాయత్రీ దేవి రూపంలో దర్శనమిచ్చారు. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: దసరా ఉత్సవ మండపాలు శుక్రవారం భక్తుల భవానీ నామ స్మరణతో కిటకిటలాడాయి. వేకువ జామునే మండపాల్లో భక్తులు అభిషేకాలు, కుంకుమ పూజలు చేసి, ప్రత్యేక నైవేద్యాలు అమ్మవారికి నివేదించి, అర్చకులు హారతులు పట్టారు. రాత్రి పూజల తరువాత మహిళలు, విద్యార్థినులు బతుకమ్మలను తీసుకు వచ్చి ఆటపాటలతో సందడి చేశారు.




రేఖపల్లిలో..

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగి, దూసరపాము, వట్టిగెడ్డ, జడ్డంగి, చెరుకుంపాలెం, చికిలింత, అమినాబాద్, బడదనాంపల్లి, శరభవరం, కొండపల్లి, లబ్బర్తి, లాగరాయి, కింద్ర తదితర గ్రామాల్లో దుర్గాదేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రెండో రోజు దుర్గమ్మ గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల వద్ద అన్న సమారాధన చేశారు.

కొయ్యూరు, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రుల సందర్భంగా కొయ్యూరులోని కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం లక్ష్మీగణపతి, చండీ, మహారుద్ర హోమాలను వేద పండితులు వైభవంగా నిర్వహించారు. శ్రీచక్ర అర్చనకు ఉపయోగపడే పావుకిలో వెండి గిన్నెని అనిశెట్టి చిరంజీవి దంపతులు ఆలయ అర్చకులకు అందించారు. కమిటీ సభ్యులు, భవానీ భక్తులు పాల్గొన్నారు.



కొయ్యూరులో..



ఎటపాకలో అమ్మవారికి పూజలు



దూసరపాములో గాయత్రీ దేవి అలంకరణ

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అంతర్ల అనాదిశ్వర ఆలయంలో వేద పడింతులు వినోద్ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బేతాలుడు తదితరులు పాల్గొన్నారు.

# అయిదేళ్లయినా అసంపూర్తే

రంపచోడవరం, న్యూస్‌టుడే: మండలంలోని పందిరివీధి ఆర్ అండ్‌బీ రోడ్డు నుంచి మర్రివాడకు చేపట్టిన బీటీ, సీసీ రోడ్డు పనులు అయిదేళ్లయిన నేటికి పూర్తికాలేదు. దీంతో రాకపోకలకు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. 2019లో వైకాపా అధికారం చేపట్టిన తర్వాత పందిరివీధి నుంచి మర్రివాడకు మూడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులకు రూ.రెండు కోట్లు మంజూరయ్యాయి. దీంతో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ (పీఐయు) అధికారులు ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన వృద్ధి ఇన్‌ఫోటెక్ సంస్థ ఈ పనులు చేపట్టింది. కొంతవరకు బీటీ రోడ్డుతోపాటు మరికొంత భాగం వరకు సీసీ రోడ్డును వేయాల్సి ఉన్నప్పటికి ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపంతో పాటు గుత్తేదారు నిర్లక్ష్యంతో సగం పనులు కూడా పూర్తికాలేదు. దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించామని స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికి అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పందిరవీధి నుంచి మర్రివాడ రోడ్డు దుస్థితి

# విద్యార్థి ఆచూకీపై సన్నగిల్లుతున్న ఆశలు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లిలోని 'జలతరంగిణి' జలపాతం వద్ద గత నెల 22న గల్లంతైన వైద్య విద్యార్థి సీహెచ్ హరదీప్ (20) ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. ఇప్పటికే దాదాపు 15 రోజులు కావడంతో కేంద్ర, రాష్ట్ర విపత్తు నివారణ సంస్థల సిబ్బంది వెనుదిరిగి వెళ్లిపోయారు. స్థానిక అధికారులు మాత్రం పట్టువదలని విక్రమార్కుల్లా గాలింపు చర్యలు కొనసాగిస్తూనే ఉన్నారు. తాజాగా ఈ గాలింపు చర్యల్లో మారేడుమిల్లికి చెందిన యువకులు భాగస్వాములయ్యారు. మారేడుమిల్లిలోని స్థానిక యువకులతోపాటు, కేబ్స్, ఆటో యూనియన్ల సభ్యులు శుక్రవారం ఈ గాలింపులో భాగస్వాములయ్యారు. అటవీశాఖ జిల్లా అధికారి నరేంద్రియన్ పర్యవేక్షించారు. శనివారం కూడా గాలింపు కొనసాగిస్తామని వెల్లడించారు. అయితే రోజులు గడిచి పోతుండడంతో వైద్య విద్యార్థి ఆచూకీపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. కుటుంబ సభ్యులు ఇప్పటికే తమ స్వగ్రామం ప్రకాశం జిల్లా మార్కాపురం వెళ్లిపోయారు.



గాలింపు చర్యల్లో డీఎఫ్‌వో నరేంద్రియన్

## గంజాయి సాగు, రవాణాపై సమాచారమివ్వండి

రంపచోడవరం, న్యూస్‌టుడే: అసాంఘిక కార్యకలాపాలకు యువత దూరంగా ఉండాలని ఎస్సై సాధిక్ పేర్కొన్నారు. కొత్తగాంధీనగరం పునరావాసకాలనీలో గ్రామస్థులతో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గంజాయి, సారా అక్రమ రవాణా జోలికి వెళ్లవద్దన్నారు. వీటి అక్రమ రవాణాపై సమాచారం తెలిస్తే తమకు చెప్పి సహకరించాలన్నారు. యువత విద్యావంతులుగా తయారై ఉన్నత ఉద్యోగాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు తుర్రం వెంకటేశ్వర్లుదొర, యువత, గ్రామపెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వెలుగు వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న వెలుగు వీఓఏల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం వారంతా ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా నాయకులు పోతురాజు మాట్లాడుతూ.. మూడేళ్ల కాలపరిమితి ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని, ఏళ్ల తరబడి పనిచేస్తున్న వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రేడింగ్ పేరుతో వేతనాల్లో కోత, తొలగింపులు ఆపాలన్నారు. రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘ జిల్లా అధ్యక్షురాలు భాను, ఎల్బీరాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ కార్యాలయం ఎదురుగా వెలుగు వీఓఏలు ధర్నా

## జ్వరాలపై అప్రమత్తం

సీలేరు, న్యూస్‌టుడే: ఆదివాసీలు జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి డీకే హిమబిందు అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని మాదిమల్లు గ్రామంలో శుక్రవారం ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ బావకుమారి, ఏఎన్ఎంలు మత్స్యకొండ, సీత తదితరులు పాల్గొన్నారు.



మాదిమల్లులో చిన్నారికి వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి హిమబిందు

## బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో సంతోషికుమారి పేర్కొన్నారు. స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా గుమ్మకోట పంచాయతీ మెట్టపాలెం గ్రామంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. స్థానిక సర్పంచి పాగి అప్పారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో సంతోషికుమారి

# నూతన అధికారుల బాధ్యతల స్వీకరణ



చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి ఎక్సైజ్ సీఐగా **జె.కూర్మారావు** బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళంలో ఇంటెలిజెన్స్ సీఐగా పనిచేశారు. ఇంతవరకు ఇక్కడ సీఐగా పనిచేసిన వై.రాజు శ్రీకాకుళం జిల్లా పొందూరు ఎక్సైజ్ సీఐగా బదిలీపై వెళ్లారు.

### అనంతగిరి ఎస్సైగా శ్రీనివాసరావు



అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతగిరి ఎస్సైగా శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన పాడేరు మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్సైగా విధులు నిర్వర్తించారు. అనంతగిరిలో పనిచేసిన కరక రాము పాడేరులో ఎస్‌బీ విభాగానికి బదిలీ అయ్యారు.

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ ఇంజినీర్ (డీఈ)గా రఘునాథరావునాయుడు బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఈగా పనిచేసిన చాణక్య పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురానికి బదిలీపై వెళ్లారు.

### కూనవరం ఎఫ్ఆర్వోగా కరుణాకర్



కూనవరం, న్యూస్‌టుడే: కూనవరం అటవీ క్షేత్ర అధికారిగా (ఎఫ్ఆర్వో) ఎం.కరుణాకర్ విధుల్లో చేరారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన విజయలక్ష్మి బదిలీపై వెళ్లడంతో గోకవరంలో చేస్తున్న కరుణాకర్ ఇక్కడకు వచ్చారు. సిబ్బంది, గ్రామీణుల సహకారంతో వన సంరక్షణకు కృషి చేస్తానన్నారు.

### ప్రధాన శాస్త్రవేత్తగా బిందు



చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి ఉద్యాన పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్తగా చెట్టి బిందు నియమితులయ్యారు. ఇక్కడ ప్రధాన శాస్త్రవేత్తగా పనిచేసిన డాక్టర్ శివకుమార్‌కు కొవ్వూరు ఉద్యాన పరిశోధనా స్థానానికి బదిలీ అయ్యింది. శివకుమార్ దంపతులను శుక్రవారం పరిశోధనాస్థానం అధికారులు, సిబ్బంది సత్కరించి వీడ్కోలు పలికారు.

### దేవీపట్నం తహసీల్దార్‌గా సత్యనారాయణ

దేవీపట్నం, న్యూస్‌టుడే: దేవీపట్నం తహసీల్దార్‌గా కె.సత్యనారాయణను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకూ ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన పి.రామకృష్ణ గంగవరం తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

### సీలేరు రేంజ్ అధికారిగా వెంకటరావు



సీలేరు, న్యూస్‌టుడే: అటవీశాఖ సీలేరు రేంజ్ అధికారిగా సుంకరి వెంకటరావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరావును అనకాపల్లి జిల్లా కృష్ణదేవిపేట రేంజ్‌కు బదిలీ చేశారు. కేడీపేటలో రేంజ్ అధికారిగా పనిచేస్తున్న వెంకటరావును సీలేరు రేంజ్‌కు బదిలీ చేశారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

### పాడేరు ఎంపీడీఓగా డేవిడ్‌రాజు

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు ఎంపీడీఓగా ఎస్.డేవిడ్‌రాజు బాధ్యతలు స్వీకరించారు. గొలుగొండ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఈయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ సాయినవీన్ తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓను కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు.

★ అల్లూరి జిల్లా భూ రికార్డులు, సర్వేశాఖ ఇన్‌ఛార్జి ఏడీగా దేవేంద్ర బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మోహనరావు రాజమహేంద్రవరం బదిలీ అయ్యారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

**పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172**

రంపచోడవరం, న్యూస్‌టుడే:

?: బోలగొండ నుంచి చుప్పరిపాలెం రహదారిలో మెటల్ లేచిపోయి ఛిద్రంగా మారింది. దీంతో రాకపోలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– బొగ్గుల సత్యనారాయణ, మాజీ సర్పంచి, బోలగొండ

✓: బోలగొండ-చుప్పరిపాలెం రోడ్డుకు ప్రతిపాదలను పంపించాం. మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– చైతన్య, డీఈ, గిరిజన సంక్షేమశాఖ, రంపచోడవరం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే

?: మారేడుమిల్లి నుంచి భద్రాచలం వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిలో వాలమూరు వద్ద పాములేరు వాగుపై ఉన్న వంతెన రెయిలింగులు విరిగిపోయి ప్రమాదకరంగా మారింది.

– పల్లాల చంద్రారెడ్డి, వాలమూరు

✓: పాములేరు వాగుపై వంతెనకు అవసరమైన రక్షణ చర్యలు చేపడతాం. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

– ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ, మారేడుమిల్లి



# ఉపాధి పథకం పల్లెలకు వరం

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: గతేడాది కంటే ఈ ఏడాది ఎక్కువ అభివృద్ధి పనులు గుర్తించాలని ఎంపీపీ కారం లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి అధికారులను కోరారు. అన్నవరంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ ఉపాధి హామీ పనుల గుర్తింపు గ్రామసభలో వారు మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి ఉపాధిహామీ పథకం ఒక వరమని, దీని ద్వారా గ్రామాల అభివృద్ధికి అవసరమైన వనరులు సమకూరుతాయన్నారు. గతేడాది 70 పనులు, రూ.70లక్షల నిధులతో 32 వేల పనిదినాలు చూపామని ఏపీవో చిరంజీవులు తెలిపారు. తొలుత గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రజాప్రతినిదులు మొక్కలు నాటారు. సర్పంచి సరోజిని, కార్యదర్శి శివప్రసాద్, తెదేపా, సీపీఎం నాయకులు బురక కన్నారావు, పూనెం సత్యనారాయణ, ఎస్సైలు సత్యనారాయణ, సంతోశ్, గ్రామస్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు

# పాడేరులో ట్రాఫిక్‌కు అంతరాయం

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు ఐటీడీఏ కార్యాలయం సమీపంలోని ప్రధాన రహదారిలో శుక్రవారం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పీఎంఆర్‌సీ కూడలి వద్ద కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులు చేపడుతున్నారు. ఇది ప్రధాన రహదారి కావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాత్రి సమయంలో పనులు చేపట్టాలని పలువురు వాహనదారులు గుత్తేదారులకు చెప్పిన వినకుండా వారు పనులు చేపట్టడంతో సుమారు అర కిలో మీటరు దూరం వరకు వాహనాల రాకపోకలు స్తంభించాయి.



ఐటీడీఏ కార్యాలయం సమీపంలో నిలిచిన వాహనాలు

# ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మండల ప్రత్యేకాధికారి జాన్‌రాజు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. చెరుకుంపాలెం సచివాలయాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. సంక్షేమ వసతి గృహాల్లో, పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందజేయాలన్నారు. ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.



రాజవొమ్మంగిలో అధికారులతో సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి